సాక్షి అనంతపురం

శుక్రవారం । 24 । జనవరి । 2025



కందుల కొనుగోలు ప్రారంభం

జిల్లాలో కందుల కొనుగోలు ప్రారంభమైంది. ఉరవకొండలో జేసీ శివ్‌నారాయణ్ శర్మ లాంఛనంగా ప్రారంభించారు. 8లో



కిలో టమాట రూ.12

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.12, కనిష్టం రూ.8, సరాసరి రూ.10 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
35.8°/14.1°

జిల్లా అంతటా గురువారం చలి వాతావరణం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

కలెక్టర్, ఎస్పీకి ఉత్తమ అవార్డులు

- తహసీల్దారు, ఇద్దరు బీఎల్‌ఓలకు కూడా..
- ఓటరు జాబితా సవరణలో పనితీరుకు గుర్తింపు




కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్



తహసీల్దారు హరికుమార్

అనంతపురం అర్బన్: ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా అధికారులు, సిబ్బంది రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపికయ్యారు. ఐఏఎస్, ఐపీఎస్ కేటగిరీలో రాష్ట్రస్థాయి అవార్డుకు కలెక్టర్ వి.వినోద్ కుమార్, ఎస్పీ పి.జగదీష్ ఎంపికయ్యారు. సిబ్బంది విషయానికి వస్తే అనంతపురం అర్బన్ తహసీల్దారు హరికుమార్, బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓ) వి.రూప తేజస్విని, సి.అంజలిని ఎంపిక చేశారు. ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా వీరికి అవార్డులు ప్రదానం చేస్తారు.

ప్రమాద వివరాలు విధిగా నమోదు చేయాలి

- డీఎంహెచ్‌ఓ భ్రమరాంబ దేవి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: రోడ్డు ప్రమాదాల వివరాలను ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటా బేస్ యాప్‌లో విధిగా నమోదు చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ. భ్రమరాంబ దేవి సూచించారు. యాప్‌పై గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వివిధ నెట్‌వర్క్ ఆస్పత్రుల నిర్వాహకులకు ప్రాజెక్ట్ మేనేజర్ సోమ్లా నాయక్ శిక్షణ ఇచ్చారు. యాప్ విధివిధానాలు, ఆస్పత్రిలో అమలు చేయాల్సిన ప్రోటోకాల్స్ వివరించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులను ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకుని మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఎన్‌టీఆర్ వైద్య సేవ కింద ఉచితంగా వైద్యం అందించాలని, క్షతగాత్రుల వద్ద అదనపు వసూళ్లకు పాల్పడకూడదన్నారు. డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డెమో త్యాగరాజు, ఆరోగ్య బోధనాధికారి గంగాధర్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేష్, లీగల్ అడ్వైజర్ ఆషారాణి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ జట్ల ఎంపిక



జిల్లా సీనియర్ కబడ్డీ జట్టుకు ఎంపికైన పురుష, మహిళా క్రీడాకారులు

బత్తలపల్లి: కబడ్డీ క్రీడలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చి జాతీయ జట్టులో స్థానం సంపాదించాలని ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ ప్రమీల కుమారి, ఏటీఎల్ రుక్మాంగద సూచించారు. గురువారం బత్తలపల్లి ఆర్డీటీ క్రీడా మైదానంలో పురుషులు, మహిళా సీనియర్ కబడ్డీ జట్లను ఎంపిక చేశారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నలుమూలల నుంచి 50 మందికిపైగా క్రీడాకారులు హాజరయ్యారు. ఈ నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ విశాఖపట్నం జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఎంపికైన క్రీడాకారులు కబడ్డీ పోటీల్లో మంచి ప్రతిభను కనబర్చి జాతీయ జట్టులో చోటు దక్కించుకోవాలన్నారు. అలాగే క్రీడా పోటీలతో సమానంగా విద్యలోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.రామ్ తేజ్‌గౌడు, కార్యదర్శి రాగిరి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పురుషుల జట్టు

సిసీంద్రీ, రాజశేఖర్, మధు, కపిల్‌దేవ్, శ్రీధర్, కె.గణేష్, హరిచరణ్, నరేష్, మణిదీప్, ఎస్.గణేష్, శ్రీనివాసులు, దాదా ఖలందర్.

మహిళా జట్టు

ఆయేషా, మేజబి, ధరిణి, ఉష, జయశ్రీ, మానస, గంగోత్రి, నందిని, వాణిశ్రీ, హేమలత, కవిత, నవ్యబాయి.



- అనంతపురం శివారులోని నారాయణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి చరణ్ గురువారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఫీజులు చెల్లించకపోవడంతో కళాశాలలోకి అనుమతించకుండా గంటల తరబడి బయటే నిలబెట్టడంతో అవమానంగా భావించిన విద్యార్థి ఆ తర్వాత కళాశాలలోని మూడో అంతస్తు నుంచి కిందకుదూకి ఆత్మహత్య చేసుకున్నాడు.
- రెండేళ్ల క్రితం అనంతపురం నగరంలోని నారాయణ క్యాంపస్ బిల్డింగ్ పై నుంచి భవ్యశ్రీ అనే ఇంటర్ విద్యార్థిని దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. మృత్యువు నుంచి బయట పడినా చికిత్సకు సుదీర్ఘకాలం పట్టింది.

కార్పొరేటు ఆత్మహత్యలు!

తీరు మారని యాజమాన్యాలు

- ఫీజుల కోసం విద్యార్థులపై తీవ్ర ఒత్తిళ్లు
- మానసికంగా చితికిపోతున్న పిల్లలు
- ఎటూపాలుపోక బలవన్మరణాలు
- మార్కులు, ర్యాంకుల మాయలో మోసపోతున్న తల్లిదండ్రులు

అనంతపురం ఎడ్యుకేషన్: కార్పొరేటు పాఠశాలలు, కళాశాలల తీరు మారడం లేదు. ధనార్జనే ధ్యేయంగా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఫీజు కట్టకుంటే విద్యార్థులను అవమానాలకు గురి చేస్తున్నారు. ఒక వైపు చదువులు.. మరో వైపు ఫీజుల వేధింపులు.. వెరసి విద్యార్థులు ఒత్తిడి భరించలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. కన్నవారికి తీరని శోకం నింపుతున్నారు.

మాయలో తల్లిదండ్రులు..

డబ్బు గుంజడమే ధ్యేయంగా పుట్టుకొచ్చిన కార్పొరేట్ కళాశాలలు... విద్యార్థుల తల్లిదండ్రులను మార్కులు, ర్యాంకుల మాయలో పడేశాయి. తమకంటే పిల్లలు ఉన్నత స్థితిలో ఉండాలనే ఆశ... తల్లిదండ్రులను ఈ మాయలో పడేలా చేస్తోంది. ఈ క్రమంలో పిల్లలు పడుతున్న మానసిక ఒత్తిళ్లను గుర్తించలేకపోతున్నారు. అప్పులు చేసి, ఆస్తులు అమ్మి లక్షలాది రూపాయల ఫీజులు కడుతున్నారు. కళాశాలల్లో వసతులు, యాజమాన్యాలు పెడుతున్న ఒత్తిళ్లను గుర్తించడం లేదు. ఫలితంగా ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థులు అన్యాయంగా బలవుతున్నారు.

చదువుల పేరిట బందీ

కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుల పేరిట విద్యార్థులు బందీలవుతున్నారు. మార్కులు, ర్యాంకులపై విస్తృత ప్రచారం చేస్తుండటంతో తల్లిదండ్రులు ఏమాత్రం ఆలోచించకుండా ఆ కళాశాలల వైపు పరుగులు పెడుతున్నారు. చదువుల పేరిట రోజూ ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులను వేధిస్తున్నారు. సెలవు దినాలనూ వదలడం లేదు. దీనికితోడు ఏ ఒక్క విద్యాసంస్థలోనూ పిల్లలకు క్రీడా పోటీలు నిర్వహించడం లేదు. మానసికోల్లాస తరగతులు కానరావడం లేదు. విశ్రాంతి లేకుండా చదువుల పేరుతో వేధిస్తున్నారు. దీనికితోడు ఫీజులు చెల్లించాలని యాజమాన్యాలు అందరి ముందూ దండించడం, అవమానాలకు గురి చేస్తుండటంతో మరింతగా కుంగిపోయి ప్రాణాలు తీసుకుంటున్నారు.

ఆలోచించండి అమ్మానాన్న..

పిల్లల బంగారు భవిష్యత్తు కోసం కార్పొరేట్ విద్యాసంస్థల్లో చేరుస్తున్న తల్లిదండ్రులు ఒక విషయం ఆలోచించాలి. పిల్లలు ఆరోగ్యంగా ఉంటే బంగారు భవిష్యత్తు ఇవ్వొచ్చు కానీ మానసిక ఒత్తిళ్లకు గురై వారికి భవిష్యత్తే లేకుండా పోతే ఏం చేస్తామని పలువురు పేర్కొంటున్నారు. కొందరు ఒత్తిడిని అధిగమించలేక బలవన్మరణాలకు పాల్పడుతుంటే మరికొందరు విద్యార్థులు ఒత్తిడిని తమలోనే దాచుకుంటూ అనారోగ్య సమస్యలను కొనితెచ్చుకుంటున్నారు. కార్పొరేటు విద్యాసంస్థల ఆగడాలపై ప్రభుత్వ పెద్దలు కూడా దృష్టి సారించాలని విద్యార్థి సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. అన్ని విద్యాసంస్థలు ముఖ్యంగా కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మానసిక వికాస తరగతులు, ఆటపాటలు, క్రీడలు కచ్చితంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన నారాయణ కళాశాల



సర్వజనాస్పత్రి వద్ద రోదిస్తున్న విద్యార్థి చరణ్ తల్లిదండ్రులు

ఆత్మహత్యలకు నిలయంగా నారాయణ విద్యా సంస్థలు



నారాయణ విద్యా సంస్థలు ఆత్మహత్యలకు నిలయంగా నిలుస్తున్నాయి. బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థి చరణ్ మృతదేహాన్ని ఎవరికీ సమాచారం ఇవ్వకుండా కాలేజీ యాజమాన్యం వారే ఆస్పత్రికి తరలించడం వెనుక ఆంతర్యమేమిటి? నారాయణ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. కళాశాల గుర్తింపు రద్దు చేయాలి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇలాంటి ఘటనలు తరచూ చోటు చేసుకుంటుండటం బాధాకరం. కరువు జిల్లా అనంతపురంలో విద్యను వ్యాపారంగా చేసి పేద మధ్యతరగతి పిల్లల మరణాలకు కారణమవుతున్న నారాయణ కాలేజీలను సీజ్ చేయాలి. – చంద్రశేఖర్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు

కార్పొరేట్ మాయలో పడొద్దు



నారాయణ విద్యాసంస్థల్లో ఫీజుల పేరుతో విద్యార్థులను వేధిస్తూ తల్లిదండ్రులకు మాయమాటలు చెబుతున్నారు. ఎక్కడో వేరే రాష్ట్రాల్లో వచ్చిన ర్యాంకులు తీసుకుని ఈ జిల్లాల్లో వచ్చినట్టు ప్రచారాలు చేసుకుంటూ ఫీజులు దండుకుంటున్నారు. తల్లిదండ్రులు కూడా ఆలోచించాలి. కార్పొరేట్ మాయలో పడొద్దు.

– ఈ. కుళ్లాయిస్వామి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

కౌన్సెలింగ్ అందించాలి



నిర్బంధ విద్యతో విద్యార్థులు చితికిపోతున్నారు. కళాశాలల యాజమాన్యాలు క్రిమిలేయర్ పేరుతో విద్యార్థులను విభజించడంతో వారు మానసికంగా కుంగిపోతున్నారు. ఎవరికీ చెప్పుకోలేక మానసిక రుగ్మతలతో ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారు. విద్యార్థుల్లోని లోపాలు, సామర్థ్యాలను తల్లిదండ్రులు, యాజమాన్యాలు గుర్తించాలి. కౌన్సెలింగ్ అందించాలి. ఫీజుల విషయాన్ని పిల్లలతో కాకుండా తల్లిదండ్రులతో మాట్లాడితే బాగుంటుంది.

– డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్, మానసిక వైద్య నిపుణులు

కళ్లు మూసుకున్నాం.. కొల్లగొట్టుకోండి!

- జిల్లాలో ఆగని దొంగతనాలు
- గడిచిన కొన్ని నెలల్లోనే ఏటీఎంల లూటీ.. రకరకాల చోరీలు
- తాజాగా 'రాజహంస స్వీట్‌హోం'లో దొంగల బీభత్సం
- పోలీసుల అప్రమత్తంగా లేకపోవడం వల్లే భారీ దోపిడీ
- భద్రత కంటే ఎమ్మెల్యేల సేవలోనే తరిస్తున్న పోలీసులు
- 'డాకు మహారాజ్' సభకు వందమందితో పహారా

జిల్లాలో చోరీలు ఆగడం లేదు.ఎక్కడో ఒక చోట దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. పోలీసులు తమ అసలు కర్తవ్యాన్ని మరిచి... ప్రజల భద్రతను గాలికొదిలేసి.. నిత్యం ప్రజాప్రతినిధుల సేవలోనే తరిస్తుండటంతో ఇదే అదునుగా దొంగలు రెచ్చిపోతున్నారు. సాధారణ ప్రజానీకానికి కంటిమీద కునుకులేకుండా చేస్తున్నారు.



సాక్షి ప్రతినిధి, అనంతపురం: శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసుల వైఫల్యం సామాన్యుల గుండెల్లో రైళ్లు పరిగెట్టేలా చేస్తోంది. తాజాగా బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న 'రాజహంస స్వీట్‌హోం' విల్లాస్‌లో జరిగిన అతిపెద్ద దోపిడీ జిల్లాలో దొంగల స్వైర విహారానికి అద్దం పట్టింది. ఈ క్రమంలోనే పోలీసుల నిస్సహాయతపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల రక్షణను విస్మరించి రాజకీయ నాయకులకు కొమ్ముకాస్తూ ఇప్పటికే ఖాకీలు అభాసుపాలయ్యారు.

'ఎల్‌హెచ్‌ఎంఎస్' గాలికి..!

ఏదైనా పండుగ, పర్వదినాల సందర్భంలో కాలనీ వాసులు ఇళ్లకు తాళాలు వేసి వేరే ఊళ్లకు వెళ్తారు. అలాంటి సమయాల్లో ఆయా ఇళ్లపై ప్రత్యేక నిఘా ఉంచేలా 'ఎల్‌హెచ్‌ఎంఎస్'ను ప్రవేశపెట్టారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పోలీసులు ఈ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేశారు. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చాక 'ఎల్‌హెచ్‌ఎంఎస్'ను పూర్తిగా గాలికొదిలేశారు. దీంతో జిల్లాలో ఏటీఎంల లూటీ మొదలు భారీ దొంగతనాల వరకూ అడ్డూ అదుపూ లేకుండా జరుగుతున్నాయి.

అస్తమానం ఎమ్మెల్యేల సేవలోనే..

కూటమి ప్రభుత్వం ఏర్పడింది మొదలు పోలీసులు తమ అసలైన విధులు గాలికొదిలేసినట్టు విమర్శలున్నాయి. ముఖ్యంగా అర్బన్ ప్రాంతాల్లో ఎమ్మెల్యేల సిఫార్సులతో పోస్టింగులు తెచ్చుకున్న సీఐలు.. ఎమ్మెల్యేల సేవలో తరిస్తున్నారు. 24 గంటలూ ప్రజాప్రతినిధుల పనులకే అంకితమవుతున్నారు. ఎమ్మెల్యేల మద్యం షాపులు, బెల్టుషాపులు, రియల్ ఎస్టేట్ వ్యాపారాల చుట్టూనే వారి కార్యకలాపాలు ఉంటున్నాయి. దీనికితోడు స్టేషన్లలో సివిల్ పంచాయితీలు చేస్తూ తీరిక లేకుండా ఉంటున్నారు. దీంతోనే పోలీసు వ్యవస్థ డొల్లగా మారినట్టు తెలుస్తోంది.

'డాకు'పై దృష్టి సామాన్యులపై లేదా?

ఈనెల 8న బాలకృష్ణ నటించిన 'డాకు మహారాజ్' సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ జరగాల్సి ఉంది.తిరుపతిలో తొక్కిలాట ఘటనతో వాయిదా వేశారు. అప్పట్లో ఫంక్షన్ కోసం 150 మంది పోలీసులు పహారా కాశారు. ఇప్పుడేమో శివారు ప్రాంతంలో భారీ దొంగతనం జరిగిన రోజే 'డాకు మహారాజ్' విజయోత్సవ సభకు వంద మందికి పైగా పోలీసులను బందోబస్తుకు కేటాయించారు. సినిమా ఫంక్షన్‌పై ఉన్న శ్రద్ధ శివారు ప్రాంత కాలనీలపై ఉంటే ఇంత జరిగేది కాదని సామాన్యులు వాపోతున్నారు. రౌతు మెత్తనయితే గుర్రం మూడుకాళ్లపై పరిగెట్టిందన్న చందంగా.. ఎస్పీ చేతుల్లో నుంచి ఎమ్మెల్యేల చేతుల్లోకి సీఐలు వెళ్లిపోవడంతోనే వారి వ్యవహారాలకు అడ్డు లేకుండా పోయిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులు ఏ మాత్రం అప్రమత్తంగా ఉన్నా 'రాజహంస స్వీట్‌హోం' విల్లాస్‌లో భారీ దొంగతనం జరిగేది కాదని నిపుణులు చెబుతున్నారు.

క్రమశిక్షణ తప్పితే కఠిన చర్యలు

- జవాబుదారీగా పనిచేస్తేనే ఉత్తమ ఫలితాలు
- కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం అర్బన్: ''జవాబుదారీగా ఉంటూ క్రమశిక్షణతో పనిచేసినప్పుడే ఉత్తమ ఫలితాలు వస్తాయి. ఆ దిశగా విధులు నిర్వర్తించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని బాధ్యతగా పనిచేయాలి. ముఖ్యంగా జిల్లాలో బాల్యవివాహాలు ఒక్కటీ జరగకుండా చూడాలి'' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. 'కౌమార సాధికారత, బాల్యవివాహాల నివారణ' అనే అంశంపై కలెక్టర్ గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాస్థాయి కో–ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మిషన్ శక్తి', 'కిశోరి వికాసం'లో భాగంగా అనంత బాలికల స్వీయ రక్షణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. జిల్లావ్యాప్తంగా 100 పాఠశాలల్లో దాదాపు 50 వేల మంది బాలికలకు స్వీయ రక్షణ నైపుణ్యాలు, మానసిక సాధికారత, ఓవరాల్ డెవలప్‌మెంట్ అంశాలపై రెండో విడత అవగాహన, శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించామన్నారు. కౌమార బాలికల కోసం యూనిసెఫ్ రూపొందించిన పుస్తకాలను అందించాలని సూచించారు. బాల్యవివాహాలకు సంబంధించి జూలై 2023 నుంచి ఇప్పటి వరకు 544 కేసులు వచ్చాయన్నారు. ఇందులో 534 కేసులు నిరోధించగలిగారని, 10 కేసుల్లో ఎఫ్‌ఐఆర్ నమోదైందని వెల్లడించారు. 28 మందిని బైండోవర్ చేయాల్సి ఉండగా 24 మందినే చేశారని, మిగిలిన వారిని ఎందుకు చేయలేదని కలెక్టర్ ప్రశ్నించారు. వారిని కూడా అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. బాల్య వివాహాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయి బాల్య వివాహ నిరోధక, పర్యవేక్షక కమిటీలను 15 రోజుల్లోపు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. టీనేజీ వయసులో గర్భధారణ వల్ల తలెత్తే అనర్థాలపై గ్రామాల్లో, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించి కొన్ని పనులు ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. వాటిని త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. సమావేశానికి సభ్యులందరూ తప్పక హాజరవ్వాలన్నారు. గైర్హాజరైతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి, డీఈఓ ప్రసాద్‌బాబు, డీవీఈఓ వెంకటరమణ నాయక్, గిరిజన సంక్షేమశాఖాధికారి రామాంజినేయులు, జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, సంఘిక సంక్షేమ శాఖ జేడీ సూర్యప్రతాపరెడ్డి, బీసీ సంక్షేమాధికారి కుష్బూకొఠారి, ఐసీడీఎస్ పీడీ వనజ అక్కమ్మ, డీపీఓ నాగరాజు నాయుడు, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, డీఐపీఆర్‌ఓ గురుస్వామిశెట్టి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భారీ చోరీ.. పార్థీగ్యాంగ్ పనే?!

- కేసుపై పోలీసుల ప్రత్యేక దృష్టి
- ప్రాథమిక సమాచారం మేరకు మహారాష్ట్ర పార్థీగ్యాంగ్‌గా గుర్తింపు
- రంగంలోకి ప్రత్యేక బృందాలు



శివారెడ్డి ఇంట్లో దొంగలు సృష్టించిన బీభత్సం(ఫైల్)

అనంతపురం: నగరంలోని రాజహంసా విల్లాస్‌లో బుధవారం తెల్లవారుజామున జరిగిన భారీ చోరీ కేసును ఛేదించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. రూ.3.50 కోట్ల విలువ చేసే బంగారు, వజ్రాల, ఆభరణాలతో పాటు రూ. 20 లక్షల నగదు కలిసి మొత్తం రూ.3.70 కోట్ల మేర చోరీ జరిగినట్లు బాధితుడు కొండ్రెడ్డి వెంకట శివారెడ్డి ఫిర్యాదు చేశారు. జిల్లాలోనే అతి పెద్ద చోరీ కావడంతో పోలీసులు కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.

కీలక సమాచారం లభ్యం..

ఘటనాస్థలిని పరిశీలించిన పోలీసులకు కీలక సమాచారం లభ్యమైనట్లు తెలుస్తోంది. చోరీ జరిగిన ఇంట్లో సేకరించిన వేలిముద్రలతో మహారాష్ట్రకు చెందిన పార్థీ గ్యాంగ్ ముఠా సభ్యుల ఫింగర్ ప్రింట్ మ్యాచ్ అయింది. దీంతో ముఠాను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. మంగళవారం విల్లాలో ఎవరెవరు తిరిగారు? వస్తువులు అమ్మే తరహాలో ఎవరైనా వచ్చారా? రెక్కీ నిర్వహించింది ఎవరు? అనే కోణంలో పరిశీలిస్తున్నారు. మరో వైపు శివారెడ్డికి తెలిసిన వారి హస్తం ఏమైనా ఉందా? అనే కోణంలోనూ ఆరా తీస్తున్నారు. స్థానికంగా ఉంటూ విల్లాల్లో అనుమానాస్పదంగా సంచరించే వారి వివరాలను కూడా పరిశీలిస్తున్నారు. ముఖాలకు మాస్కులు ధరించడంతో పాటు అధునాతన పరికరాలను ఉపయోగించి చోరీలకు పాల్పడ్డారంటే చోరీల్లో నిష్ణాతులైన వారి పనే అని పోలీసులు భావిస్తున్నారు. గతంలో కేవలం ఎస్‌బీఐ ఏటీఎంలనే పార్థీ గ్యాంగ్ కొల్లగొట్టేది. దీంతో జిల్లాలో ఏటీఎంల వద్ద పోలీసులు భద్రత కట్టుదిట్టం చేయగా... ఇప్పుడు శివారు ప్రాంతాల్లోని విల్లాలపై పడటం గమనార్హం.

వృషభ రాజసం



హావళిగి గ్రామంలో ఐదు ఎడ్ల బండ్లలను లాగుతున్న వృషభరాజు



గ్రామంలో వృషభరాజును ఊరేగిస్తున్న దృశ్యం

విడపనకల్లు మండలం హావళిగి గ్రామంలో ఓ వృషభ రాజు రికార్డు సృష్టించింది. గ్రామానికి చెందిన అనంతయ్య అనే రైతుకు చెందిన బాహుబలి వృషభరాజు 7.5 టన్నుల బరువు గల జొన్నల బస్తాలను ఒకేసారి కిలోమీటరు దూరం లాగి అబ్బురపరిచింది. ఐదు ఎడ్ల బండ్లలో నింపిన 103 బస్తాల జొన్నలను వృషభరాజు అవలీలగా లాగడంతో రైతులు 'జై బాహుబలి... జై జై బాహుబలి' అంటూ ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. అనంతరం రికార్డు సృష్టించిన వృషభాన్ని గ్రామంలో ఊరేగించారు. –ఉరవకొండ(విడపనకల్లు)

క్లుప్తంగా

పశువులు, జీవాల సంరక్షణ చేపట్టండి



రంగచేడులో పొట్టేలుకు నట్టల నివారణ టీకా వేస్తున్న డాక్టర్ రజనీకుమారి

గుమ్మఘట్ట: మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పశువులు, జీవాల సంరక్షణ చర్యలు చేపట్టాలని రైతులు, కాపరులకు పశుసంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ రజనీకుమారి సూచించారు. మండలంలోని రంగచేడు, నేత్రపల్లి గ్రామాల్లో గురువారం ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. టీకాల ఆవశ్యకత, నట్టల నివారణపై రైతులు, కాపరులను చైతన్య పరిచారు. పశువులు, గొర్రెలు, లేగదూడలకు నట్టల నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేత్రపల్లిలో శిథిలావస్థకు చేరుకున్న పశువుల ఆస్పత్రిని పరిశీలించారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి నూతన భవన నిర్మాణానికి నిధులు సమీకరించి పనులు చేపడతామని గ్రామస్తులకు భరోసానిచ్చారు. అనంతరం గుమ్మఘట్టలోని పశువుల ఆస్పత్రిని సందర్శించి రికార్డులు పరిశీలించారు. పశువైద్యాధికారి డాక్టర్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ... గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల ద్వారా 332 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, 224 పశువులకు, లేగదూడలకు నట్టల నివారణ టీకాలు, 38 పశువులకు గర్భకోశ చికిత్సలు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జేడీ వెంకటస్వామి, డీడీ డాక్టర్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

భార్యకు చికిత్స చేయించే ఆర్థిక స్థోమత లేక వ్యక్తి ఆత్మహత్య



మృతుడు సుందర్రాజు

పుట్టపర్తి టౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న భార్యకు చికిత్స చేయించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... బుక్కపట్నం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన సుందర్రాజు (41)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. రోజూ కూలి పనులు చేస్తే తప్ప పూట గడవని స్థితి. ఇలాంటి పరిస్థితుల్లో కొంత కాలంగా భార్య అనారోగ్యం బారిన పడింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో చూపించినా జబ్బు నయం కాలేదు. దీనికి తోడు రోజురోజుకూ భార్య ఆరోగ్య పరిస్థితి విషమిస్తుండడంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చూపించే ఆర్థిక స్థోమత లేక తీవ్ర మనోవేదనకు లోనైన సుందర్రాజు గురువారం ఉదయం ఇంట్లోనే తన భార్య చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు... సుందర్రాజు మృతదేహంపై పడి బోరున విలపించారు. సుందర్రాజు తల్లి రామలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపారు.



- అనంతపురం సమగ్రశిక్షలో వర్కింగ్ సెక్టోరియల్ అధికారుల పోస్టులన్నీ ఖాళీనే
- శ్రీ సత్యసాయి జిల్లాలోనూ విధుల్లో ఏపీసీ, అసిస్టెంట్ ఏఎంఓ మాత్రమే
- 'అనంత' జిల్లా పూర్వ డీఈఓ నిర్వాకంతో నిర్వీర్యమైన ఓ వ్యవస్థ
- రెగ్యులర్ అధికారులు లేక పర్యవేక్షణ గాలికి
- విద్యాభివృద్ధి కార్యక్రమాల అమలులో వెనుకబడుతున్న ఉమ్మడి జిల్లా

ఇద్దరే.. ఇద్దరు!

అనంతపురం ఎడ్యుకేషన్: సరిగ్గా ఏడాది క్రితం 2023, డిసెంబర్‌లో విజయవాడలో జరిగిన 'ఆనివల్ వర్క్ ప్లాన్' రాష్ట్ర స్థాయి సమావేశంలో స్వయంగా సమగ్రశిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ... విద్యాభివృద్ధి కార్యక్రమాల అమలు, పర్యవేక్షణకు సంబంధించి అన్ని అంశాల్లోనూ అనంతపురం జిల్లా ముందుందని, తక్కిన జిల్లాలు ఆదర్శంగా తీసుకోవాలంటూ చెప్పారు. ఇదే సమావేశంలో అప్పటి విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ కూడా ఉన్నారు. అలాంటి జిల్లాలో ఏడాది తర్వాత సీన్ పూర్తిగా రివర్స్ అయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొందరు అధికారులు తీసుకున్న వివాదస్పద నిర్ణయాలతో విద్యాశాఖ నిర్వీర్యమైంది. పర్యవేక్షణ కరువై యుడైస్‌ప్లస్, పాఠశాలల క్లస్టర్ రీఆర్గనైజేషన్, స్టూడెంట్ ప్రొఫైల్, టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం (టిస్), కేజీబీవీల పర్యవేక్షణ, ఆర్‌ఓ ప్లాంట్ల పర్యవేక్షణ, బడిబయట పిల్లలను గుర్తించడం తదితర అంశాల్లో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలు పూర్తిగా వెనుకపడ్డాయి. ప్రతి అంశంలోనూ కింది నుంచి రెండుమూడు స్థానాల్లో ఈ రెండు జిల్లాలు ఉండడం విశేషం. పర్యవేక్షించే అధికారులు లేకపోవడంతో ఓ వ్యవస్థ నిర్వీర్యమవుతుందనే విమర్శలు వినవస్తున్నాయి.

ఇక్కడ... అక్కడ ఇద్దరే పని చేస్తున్నారు

అనంతపురం సమగ్రశిక్షలో ఏపీసీ, ఏపీఓ మాత్రమే పని చేస్తున్నారు. ఏపీసీ పోస్టు కూడా మొన్నటిదాకా ఖాళీగా ఉండేది. ఆ తర్వాత డ్వామాలో ఏపీడీగా పని చేస్తున్న శైలజను నియమించారు. మిగిలిన సెక్టోరియల్ అధికారుల పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ఏఎంఓ, జీసీడీఓ, అసిస్టెంట్ ఏఎంఓ (జనరల్), అసిస్టెంట్ ఏఎంఓ (ఉర్దూ), అసిస్టెంట్ సీఎంఓ, అసిస్టెంట్ అలెస్కో, ఏఎస్‌ఓ, అసిస్టెంట్ ఐఈడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తాత్కాలికంగా ఇన్‌చార్జ్‌లతో సర్దుబాటు చేసుకుంటున్నారు. ఇదే తీరు శ్రీ సత్యసాయి సమగ్రశిక్షలోనూ కనిపిస్తోంది. ఏపీసీ, అసిస్టెంట్ ఏఎంఓ (ఉర్దూ) మాత్రమే అక్కడ పనిచేస్తున్నారు. ఇక సీఎంఓ, అలెస్కో, ప్లానింగ్ కోఆర్డినేటర్, ఐఈ కోఆర్డినేటర్, అసిస్టెంట్ ఏఎంఓ (జనరల్), అసిస్టెంట్ జీసీడీఓ, ఏఎస్‌ఓ, ఏపీఓ పోస్టులన్నీ ఖాళీనే. నిబంధనలకు విరుద్ధంగా ఎంఈఓలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఫలితంగా వారు క్షేత్రస్థాయిలో కీలకమైన ఎంఈఓ పోస్టులకు న్యాయం చేయలేకపోతున్నారు.

అస్మదీయుల కోసం అడ్డగోలు నిర్ణయం

సమగ్ర శిక్షలో సెక్టోరియల్ అధికారులుగా ఎవరినైనా తీసుకోవాలన్నా, ఉన్నవారిని తప్పించాలన్నా విద్యా సంవత్సరం మధ్యలో కాకుండా వేసవి సెలవుల్లోనే ఈ ప్రక్రియ చేపట్టాలని స్వయంగా విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను అనంతపురం జిల్లాలో పూర్వపు డీఈఓ తుంగలో తొక్కారు. అస్మదీయుల కోసం అడ్డగోలు నిర్ణయం తీసుకుని ఏపీఓ తప్ప మిగిలిన అందరినీ ఏకకాలంలో 2024, జూలై 31న పట్టుపట్టి రిలీవ్ చేయించారు. అదే ఏడాది ఆగస్టు 1న కొత్తవారిని తీసుకునేందుకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఆ తర్వాత ఇంటర్వ్యూలు చేపట్టారు. అంతే ఇప్పటిదాకా ఆయా పోస్టులను భర్తీ చేయలేదు. ఆ అధికారి తీసుకున్న నిర్ణయాల కారణంగా కొందరు ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని తాము చెప్పిన వారిని తీసుకోవాలంటూ ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు చేశారు. దీంతో అధికారులు ఏ నిర్ణయం తీసుకోకుండా ఇప్పటి వరకూ నాన్చుతూ వస్తున్నారు. రాష్ట్రంలో తక్కిన 25 జిల్లాల్లో ఎక్కడేగాని ఇంతటి దారుణమైన నిర్ణయాలు తీసుకోలేదు. తాజాగా డీఈఓ కార్యాలయంలోనూ ఏఎస్‌ఓ పోస్టు భర్తీలో అనర్హుడిని తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఏపీఓ పోస్టులో కూడా నిబంధనలకు విరుద్ధంగా శ్రీ సత్యసాయి జిల్లాలో పని చేస్తున్న టీచరుకు అవకాశం కల్పించారు.

నేడు జిల్లాకు ప్రాథమిక విద్య కమిషనర్

ప్రాథమిక విద్య కమిషనర్ విజయరామరాజు శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు జేఎన్‌టీయూఏ ఆడిటోరియంలో విద్యాశాఖ అధికారులతో సమీక్షించనున్నారు. ఈ నేపథ్యంలో అనంతపురం, శ్రీసత్యసాయి సమగ్రశిక్ష కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారుల పోస్టుల భర్తీ అంశంపై కమిషనర్ దృష్టి సారించాలని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కొందరు అధికారుల అసంబద్ధ నిర్ణయాలతో విద్యాశాఖ నిర్వీర్యమవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధుల జోక్యం తగ్గించి ప్రభుత్వ నిబంధనల మేరకు సెక్టోరియల్ అధికారుల పోస్టులు, డీఈఓ కార్యాలయాల్లో ఏపీఓ, ఏఎస్‌ఓ పోస్టుల భర్తీ చేసి ఉమ్మడి జిల్లాలో విద్యాభివృద్ధి కార్యక్రమాలు మునుపటిలా సజావుగా సాగేలా చూడాలని ఎంఈఓలు, హెచ్‌ఎంలు, టీచర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

హమ్మయ్యా.. బతికిపోయా!

- దున్నపోతును వదిలేసిన పోలీసులు



ముద్దలాపురం వైపుగా వెళుతున్న దున్నపోతు

కూడేరు: స్థానిక పోలీసు స్టేషన్‌లో ఈ నెల 6 నుంచి పోలీసుల సంరక్షణలో ఉన్న దున్నపోతును గురువారం వదిలేశారు. ఈ దున్నపోతు కోసం మండల పరిధిలోని కడదరకుంట, ముద్దలాపురం గ్రామస్తులు పోలీసులను ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీంతో దున్నపోతును రెండు గ్రామాలకు ఇవ్వమని, ఊరు దేవర ముగిశాక వదిలేస్తాని పోలీసులు స్పష్టం చేశారు. అది ఏ గ్రామానికి వెళితే అక్కడ ఉంటుందని చెప్పడంతో ఆయా గ్రామస్తులు అంగీకరించిన విషయం తెలిసిందే. బుధవారంతో రెండు గ్రామాల్లో ఊరు దేవర ముగియడంతో పోలీసులు దున్నను వదిలేశారు. అది పొలిమేర దాటి ముద్దలాపురం గ్రామం వైపుగా వెళ్లింది.

చంద్రదండు ప్రకాష్‌నాయుడిపై కేసు నమోదు

పుట్లూరు: చంద్రదండు ప్రకాష్‌నాయుడు మరో వివాదంలో చిక్కుకున్నాడు. తన అనుచరులతో కలసి టిప్పర్‌పై దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశాడు. ఘటనపై డ్రైవర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. ఎస్‌ఐ వెంకటనరసింహ తెలిపిన మేరకు... జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా మెగా కంపెనీకి చెందిన సబ్ కాంట్రాక్టర్ టిప్పర్లతో మట్టిని తరలింపు చేపట్టాడు. ఈ క్రమంలో గురువారం పెద్దపడమల రెవెన్యూ పరిధిలోని యర్రగుంటపల్లి నుంచి మట్టిని తరలిస్తున్న టిప్పర్ పుట్లూరు మండలం చింతకుంట సమీపంలోకి చేరుకోగానే చంద్రదండు ప్రకాష్‌నాయుడు తన అనుచరులతో అడ్డుకుని వాహనం అద్దాలు ధ్వంసం చేశాడు. బాధిత డ్రైవర్ సతీష్ ఫిర్యాదు మేరకు ప్రకాష్‌నాయుడితో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బెల్ట్ షాపులను నిర్వహిస్తే చర్యలు తప్పవు



రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ నాగ మద్దయ్య

బుక్కరాయసముద్రం: బెల్ట్ షాపులను నిర్వహిస్తే చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేశారు. కేసులపై ఆరా తీశారు. ఎక్సైజ్ క్రైం, జీసీఆర్, నాన్ జీసీఆర్, క్రైం డోవర్, లోక్ అదాలత్ తదితర కేసులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. నాటు సారా కాచేవారు, కర్ణాటక మద్యం తరలించే వారిపై ఉక్కుపాదం మోపాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, సీఐ సునీత సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ.. మార్పుతోనే మెరుగైన జీవితం

- ఆర్డీటీ అసోసియేట్ డైరెక్టర్ అన్నేఫెర్రర్
- అట్టహాసంగా ముగిసిన అల్ట్రా మారథాన్



సమావేశంలో మాట్లాడుతున్న అన్నేఫెర్రర్

బత్తలపల్లి: ప్రతి ఒక్కరిలోనూ ఆశ, మార్పు ఉన్నప్పుడే సంతోషకరమైన జీవితం సాధ్యమవుతుందని ఆర్డీటీ అసోసియేట్ డైరెక్టర్ అన్నేఫెర్రర్ అన్నారు. ఉమ్మడి జిల్లాలో ఆర్డీటీ ఆధ్వర్యంలో చేపట్టిన అల్ట్రా మారథాన్ రెండో రోజు గురువారం బత్తలపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఘాట్ వద్ద మారథాన్ ముగింపు సభ నిర్వహించారు. ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి అన్నేఫెర్రర్‌తో పాటు ఆర్డీటీ మహిళా సాధికారిత డైరెక్టర్ విశాలా ఫెర్రర్, మారథాన్ ఫౌండర్ జువాన్ మానువెల్, స్పెయిన్‌లో ఆర్డీటీ కార్యకలాపాల పర్యవేక్షకురాలు మయూరిలూథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రస్తుత రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇలాంటి సమయంలోనే అందరూ ఐకమత్యంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విశ్వ శాంతి నెలకొల్పడంలో భాగంగా స్పెయిన్ దేశస్తులు, భారతీయులు ఉమ్మడి కార్యాచరణ చేపడదామని పిలుపునిచ్చారు. ఈ అంశంపైనే రెండు రోజుల క్రితం స్పెయిన్ దేశస్తుడు ఒకరు ఉమ్మడి కార్యాచరణ చేపట్టే అంశంపై చర్చించారన్నారు. సమాజంలో మార్పు కోసం అల్ట్రా మారథాన్‌ను జిల్లాలో చేపట్టిన జువాన్ మానువెల్‌ను అభినందించాల్సిందేన్నారు. ఇలాగే మరో 20, 30 ఏళ్లు మారథాన్‌ను కొనసాగిస్తామన్నారు. రన్‌లో పాల్గొన్న స్పెయిన్ దేశస్తులు, ఇండియాకు చెందిన మొత్తం 120 మందిని అభినందించారు. జువాన్ మానువెల్ మాట్లాడుతూ... 'ఒక కిలోమీటరు–ఒక జీవితం' అంటూ మారథాన్ రన్ 170 కిలోమీటర్ల చేపట్టి విజయం చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లో ప్రజలను కలిసినప్పుడు వారు చెప్పిన విషయాలు తమ హృదయాలను కదిలించాయన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సేకరించిన నిధిని పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు, వివిధ అభివృద్ధి పనులకు వెచ్చించనున్నట్లు వివరించారు. కాగా, మారథాన్ బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరు వద్దకు చేరుకోగానే దారి పొడవునా ప్రజలు ఘన స్వాగతం పలికారు. రాఘవంపల్లి, బత్తలపల్లిలోనూ ప్రజలు రోడ్లపైకి చేరుకుని స్వాగతం పలికారు. కార్యక్రమంలో స్పాన్సర్ సీబా, సంస్థ డైరెక్టర్లు సాగర్‌మూర్తి, రాజశేఖర్‌రెడ్డి, సాయికృష్ణ, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, రీజనల్ డైరెక్టర్ ప్రమీల కుమారి, రామేశ్వరి, ఏటీఎల్ రుక్మాంగద, సంజీవరెడ్డి, కృష్ణ, బత్తలపల్లి స్పానిస్ బృందం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం అర్బన్: వివిధ రంగాల్లో అత్యుత్తమ సేవలందించిన వారికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా అవార్డులు అందించాలని నిర్ణయించినట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం సాయంత్రంలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక్కో రంగంలో రెండు అవార్డులు అందిస్తామన్నారు. అభ్యర్థులు తమ చిరునామా, ఫోన్ నంబర్, ఇతర వివరాలతో బయోడేటాను anantaawards@gmail.com మెయిల్ ఐడీకి పంపాలన్నారు. కలెక్టరేట్‌లో దరఖాస్తును అందజేయాలని చెప్పారు.

అవార్డు అందించే రంగాలు...

- కళ (సంగీతం, చిత్రలేఖనం, శిల్పం, ఫొటోగ్రఫీ, సినిమా, థియేటర్)
- సామాజిక సేవ (ధార్మిక సేవ, కమ్యూనిటీ ప్రాజెక్టుల్లో సహకారం)
- ప్రజా వ్యవహారాలు (చట్టం, ప్రజాజీవితం, రాజకీయాలు)
- సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (స్పేస్ ఇంజినీరింగ్, న్యూక్లియర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సైన్స్–అనుబంధ సబ్జెక్టులలో పరిశోధన, అభివృద్ధి)
- వాణిజ్యం, పరిశ్రమ (బ్యాకింగ్, ఆర్థిక కార్యకలాపాల నిర్వహణ, పర్యాటకం, వ్యాపారం)
- మెడిసిన్ (వైద్య పరిశోధన, ఆయుర్వేదం, హోమియోపతి, సిద్ధ, అల్లోపతి, నేచురోపతి)
- సాహిత్యం, విద్య (జర్నలిజం, టీచింగ్, బుక్ కంపోజింగ్, సాహిత్యం, కవితలు, విద్య, అక్షరాస్యతను ప్రోత్సమించడం, విద్యా సంస్కరణలు)
- సివిల్ సర్వీస్ (ప్రభుత్వ సేవకులచే పరిపాలనలో ప్రత్యేకత, శ్రేష్టత)
- క్రీడలు (జనాదరణ పొందిన క్రీడలు, అథ్లెటిక్స్, సాహసం, పర్వతారోహణ, క్రీడల సమాచారం, యోగా)
- ఇతరాలు (భారతీయ సంస్కృతి ప్రచారం, మానవ హక్కుల పరిరక్షణ, వన్యప్రాణుల రక్షణ, పరిరక్షణ)

కందుల కొనుగోలు ప్రారంభం

- సద్వినియోగం చేసుకోవాలి: జేసీ

ఉరవకొండ: రైతులు కందుల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ పిలుపునిచ్చారు. గురువారం ఉరవకొండ మార్కెట్‌యార్డులో కందుల కొనుగోలు కేంద్రాన్ని జేసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా కందులు రూ7,550 మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నామన్నారు. ఒక్కో రైతు నుంచి సగటున 40 క్వింటాళ్ల వరకు కొంటారన్నారు. ఉరవకొండ డివిజన్‌లో ఇప్పటి వరకూ 177 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. జేడీ ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ రైతుల ఖాతాకు 20 రోజుల్లో నగదు జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆపరేటివ్ అధికారిణి అరుణకుమారి, ఆర్‌డీఓ శ్రీనివాస్, మార్కెటింగ్ ఏడీ సత్యనారాయణచౌదరి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరీ, వ్యవసాయ శాఖ ఏడీ పద్మావతి, తహసీల్దార్ మహబూబ్‌బాషా, వ్యవసాయ శాఖ అధికారి శుభకర్, ఉరవకొండ పీఏసీఎస్ సీఈఓ శిలార్ గౌస్ పాల్గొన్నారు.

వేధింపులతోనే విద్యార్థి చరణ్ ఆత్మహత్య



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

గుంతకల్లు: నారాయణ కళాశాల యాజమాన్యం వేధింపులే ఆ కళాశాల ఇంటర్ విద్యార్థి చరణ్ ఆత్మహత్యకు కారణమని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం గుంతకల్లులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనంతపురం శివారులోని సోమలదొడ్డి వద్ద ఉన్న నారాయణ బాయ్స్ క్యాంపస్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న చరణ్ గురువారం మూడో అంతస్తు పైనుంచి దూకి చనిపోవడం చాలా బాధకరమన్నారు. ఫీజుల వేధింపులతో పాటు ర్యాంకుల పేరిట విద్యార్థులను మానసికంగా బలహీనులను చేస్తున్నారని విమర్శించారు. నారాయణ కళాశాలను తక్షణమే సీజ్ చేయడంతోపాటు యజమాని నారాయణను మంత్రి పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు దేవేంద్ర, జ్ఞానేశ్వరరెడ్డి, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న జేఎన్‌టీయూఏ ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, తదితరులు

అనంతపురం: జేఎన్‌టీయూఏ పరిధిలో డిసెంబర్–2024లో నిర్వహించిన బీటెక్ మొదటి సెమిస్టర్ (ఆర్–23) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను గురువారం ఆ వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చెన్నారెడ్డి విడుదల చేశారు. కళాశాల అకడమిక్ సెక్షన్‌లో ఫలితాలను అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.వసుంధర, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ డి.లలితకుమారి, విభాగాధిపతులు ప్రొఫెసర్ భువనవిజయ, డాక్టర్ మాధవి, డాక్టర్ ఎం. రామశేఖర్‌రెడ్డి, డాక్టర్ కళ్యాణ్ కుమార్, డాక్టర్ కళ్యాణిరాధ, డాక్టర్ జి.మమత, డాక్టర్ అజిత తదితరులు పాల్గొన్నారు.

బీఫార్మసీ ఫలితాలు విడుదల: జేఎన్‌టీయూఏ పరిధిలో గత ఏడాది డిసెంబర్‌లో నిర్వహించిన బీఫార్మసీ మూడో సంవత్సరం ఒకటో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలు, మూడో సంవత్సరం ఒకటో సెమిస్టర్ సప్లిమెంటరీ, మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. గురువారం ఉదయం ఫలితాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ వి. నాగప్రసాదనాయుడు విడుదల చేశారు.

జీడిపల్లి రిజర్వాయర్‌లో చేపలు పట్టేందుకు నేడు వేలం

బెళుగుప్ప: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో చేపలు పట్టి విక్రయించుకునేందుకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఫిషరీస్ డీడీ శ్రీనివాస్‌నాయక్, ఎఫ్‌డీఓ బాబునాయక్ తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. జీడిపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉదయం 11 గంటలకు వేలం పాట ప్రారంభమవుతుందని తెలిపారు. జీడిపల్లి, అంకంపల్లి, రామసాగరం, హనిమరెడ్డిపల్లి, దుద్దేకుంట తదితర గ్రామాల పరిధిలో రిజర్వాయర్ ఉందన్నారు. రూ.5,000 రుసుం చెల్లించి పాల్గొనాల్సి వుంటుందని, జూన్ 30 వరకు చేపలను పట్టేందుకు అనుమతి ఉంటుందని వివరించారు.

ఏకపక్షంగా వ్యవహరిస్తున్న అధికారులు

- ఫిర్యాదు చేసిన పట్టించుకోవం లేదు
- కలెక్టర్ వినోద్‌కుమార్‌కు రాప్తాడు వాసుల ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

అనంతపురం అర్బన్: 'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రాప్తాడు మండలంలో పరిస్థితులు దారుణంగా మారాయి. అధికారులందరూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. న్యాయ చేయాలంటూ మొర పెట్టుకున్నా ఫలితం లేకుండా పోతోంది. అన్యాయంపై ఫిర్యాదు చేస్తే పోలీసులు కనీసం కేసులు కూడా నమోదు చేయడం లేదు' అంటూ కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఎదుట రాప్తాడు మండల వాసులు మొరపెట్టుకున్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని చాంబర్ వద్ద కలెక్టర్ వినోద్‌కుమార్‌ను బాధితులు శూలం పెద్ద ఓబులేసు, పి.లక్ష్మీనారాయణ, మండల వైస్ ఎంపీపీ రామాంజినేయులు, వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ జూటూరు శేఖర్, నాయకులు ఆదినారాయణరెడ్డి, రామలింగయ్య, కాటంరెడ్డి, ముత్యాలు, రవికుమార్, సింగారప్ప, తదితరులు కలసి వినతిపత్రం అందజేసి, ప్రస్తుత పరిస్థితి వివరించారు. పుల్లలరేవు రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 83–3లో రైతు ఓబులేసు తనకున్న 2.86 ఎకరాల పొలంలో 200 నేరేడు చెట్లు పెంచుతుంటే ఇందులో 47 చెట్లను నరికేశారన్నారు. ఈ నెల 19న, 21న రెండు సార్లు పోలీసులకు బాధితుడు చేసిన ఫిర్యాదు బుట్టదాఖలైందన్నారు. మొత్తం 10 మందిపై ఫిర్యాదు చేస్తే కేవలం ఐదుగురిపైనే కేసు నమోదు చేసి మిగిలిన వారిపై కేసు నమోదు చేయలేమని చెబుతున్నారని వాపోయారు. చెట్లు నరికిన వారిపై కేసు నమోదు చేసేలా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అలాగే గోందిరెడ్డిపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 128–2ఎ, 2బిలో 1.78 ఎకరాల భూమి రైతు లక్ష్మీనారాయణకు ఉందన్నారు. పంటకు సత్తువ చేసేందుకు ఎర్ర మట్టి అవసరం కావడంతో భూమికి దక్షిణం వైపు ఉన్న ప్రభుత్వ గుట్ట నుంచి మట్టి తవ్వుకునేందుకు తహసీల్దారుకు గత ఏడాది డిసెంబరు 30న లక్ష్మీనారాయణ అర్జీ ఇచ్చాడని గుర్తు చేశారు. దీనిపై తహసీల్దారు స్పందించి ఆర్ఐ, వీఆర్‌ఓకు ఎండార్స్ చేస్తే స్థానిక రాజకీయ నాయకుల జోక్యంతో అనుమతులు జారీ చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహించారని వాపోయారు. భూమికి ఎర్రమట్టి తోలుకునేందుకు అనుమతి మంజూరు చేసేలా తహసీల్దారుకు ఆదేశాలిచ్చి న్యాయం చేయాలని కోరారు.

బ్లాక్‌స్పాట్స్‌లో భద్రతా చర్యలకు శ్రీకారం



బ్లాక్ స్పాట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం సెంట్రల్: ప్రమాదాలకు నెలవుగా మారిన బ్లాక్‌స్పాట్స్ వద్ద భద్రతా చర్యలు చేపట్టనున్నట్లు ఉప రవాణా కమిషనర్ వీర్రాజు తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా రవాణాశాఖ, పోలీసు, ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవే అధికారులు బ్లాక్ స్పాట్స్‌ను పరిశీలించారు. తాడిపత్రి ప్రాంతాల్లో డీటీసీ వీర్రాజు, అనంతపురం సరిహద్దులో కళ్యాణదుర్గం ఆర్టీఓ రమేష్ ఆధ్వర్యంలో అధికారుల బృందం తనిఖీలు చేసింది. జిల్లాలో 37 బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించినట్లు తెలిపారు. ఆయా బ్లాక్ స్పాట్‌లలో ప్రమాదాలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలను గుర్తించి ఈ నెల 31న జరిగే రహదారి భద్రతా సమావేశం దృష్టికి తీసుకెళ్తామని వివరించారు. కార్యక్రమంలో ఎంవీఐలు శ్రీనివాసులు, సునీత, మనోహర్‌రెడ్డి ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు సామూహిక కుంకుమార్చన

అనంతపురం సెంట్రల్: స్థానిక అశోక్‌నగర్‌లోని లలితాపరమేశ్వరి సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో ఈనెల 24న సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు కుంకుమార్చన, 12 గంటలకు మంగళ హారతి, తీర్థప్రసాద వితరణ ఉంటుందన్నారు.

ఘనంగా చంద్రబోస్ జయంతి

కనగానపల్లి: భారత స్వాతంత్య్ర పోరాట సంగ్రామంలో గొప్ప సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ అని మండల గ్రంథాలయాధికారి గోవిందు తెలిపారు. సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా గురువారం స్థానిక గ్రంథాలయంలో అధికారులు, విద్యార్థులు చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ

అనంతపురం సెంట్రల్: వ్యవసాయ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను గురువారం జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర కమిటీ ట్రెజరర్ దొరుగు శ్రీహరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రూపేష్ కుమార్, ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, కార్యదర్శి నరసింహ, సహాధ్యక్షులు ఆనందరాజు, కోశాధికారి ఆదిల్‌బాషా, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, నారాయణస్వామి, శివకుమార్, రామలింగారెడ్డి, సంయుక్త కార్యదర్శులు నాగభూషణం, అనిల్, రాజేష్, మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శివబాలయోగి మహరాజ్ జయంతి

అనంతపురం సెంట్రల్: శివ బాలయోగి మహరాజ్ జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నగరశివారులోని బెంగళూరు రోడ్డులో ఉన్న ఆశ్రమంలో రుద్రాభిషేకం, రక్తదాన శిబిరంతో పాటు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

అగ్నికి ఆహుతైన 'అనప పంట'



కాలిపోయిన అనప పంటను చూపుతున్న బాధిత రైతు

ఆత్మకూరు: మండలంలోని వేపచెర్ల గ్రామానికి చెందిన రాజేంద్రప్రసాద్ అనే రైతుకు సంబంధించిన అనప పంటలో గురువారం అగ్నికి ఆహుతైంది. ఆయన పొలం చుట్టూ ఉన్న వారు సమాచారం ఇవ్వడంతో బాధిత కుటుంబ సభ్యులు వెంటనే వెళ్లి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే అనప పంటతో పాటు డ్రిప్ వైర్లు, పైపులు కూడా కాలిపోయాయి. దాదాపు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతు రాజేంద్రప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన వివరాలను సేకరించారు. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందన్న విషయం వాళ్లకు కూడా అర్థం కావడం లేదని రైతు వాపోయారు. అధికారులు న్యాయం చేయాలని కోరారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, పోలీసులు, ఉపాధ్యాయులు

చెన్నేకొత్తపల్లి: రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులచే చెన్నేకొత్తపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఉన్నత పాఠశాల నుంచి న్యామద్దెల సర్కిల్ మీదుగా స్థానిక బస్టాండ్ వరకూ సాగింది. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ మద్యం సేవించడంతో పాటు హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలను నడపకూడదన్నారు. నాలుగు చక్రాల వాహనాలు నడిపే వారు సీట్ బెల్టు పెట్టుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎవరినైనా ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో రామగిరి సీఐ శ్రీధర్, చెన్నేకొత్తపల్లి ఎస్‌ఐ సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు.

ప్రభుత్వ కార్యాలయాలా.. పార్కింగ్ స్థలాలా?



ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ప్రాంగణంలో నెలల తరబడి నిలిచి ఉన్న వాహనాలు

జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలను కొందరు పార్కింగ్ స్థలాలుగా మార్చుకున్నారు. దర్జాగా తమ వాహనాలను రోజుల తరబడి నిలిపి ఉంచుతున్నారు. బయటి వ్యక్తులు నిలుపుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఆయా కార్యాలయాల ఉన్నతాధికారులు దీనిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



జిల్లా పరిషత్ ఆవరణలో బయటి వ్యక్తులు చాలా రోజులుగా నిలిపిన వాహనాలు



మార్కెట్ యార్డు వద్ద ఇతరుల వాహనాల పార్కింగ్

సమయపాలన పాటించకపోతే చర్యలు

- సచివాలయ సిబ్బందిని హెచ్చరించిన ఎంపీడీఓ



అంగన్‌వాడీ కేంద్రంలో ఆధార్ సేవలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ లక్ష్మీనరసింహ

ఆత్మకూరు: సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ అన్నారు. గురువారం ఆయన మండలంలోని సనప, తోపుదుర్తి గ్రామాల్లోని సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయాల్లోని రికార్డులను పరిశీలించారు. సనపలో సచివాలయం తనిఖీ అనంతరం ఉద్యోగులతో మాట్లాడారు. సచివాలయ ఉద్యోగుల హాజరును రోజూ ఆన్‌లైన్‌లో పరిశీలిస్తామన్నారు. మండలంలోని పలు సచివాలయాల ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదని, ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయ సిబ్బంది పని వేళల్లో సమయంలో అందుబాటులో లేకపోతే తమకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోండి

మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 0 నుంచి 6 ఏళ్ల వయసు గల పిల్లలకు ఆధార్ నమోదు చేపట్టామని, సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఆధార్ సేవలను ఆయన పరిశీలించారు.

నెలాఖరులోపు పనులు పూర్తి చేయండి



గోకుల షెడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఏపీడీ

ఆత్మకూరు: మండలానికి మంజూరైన గోకులం షెడ్ల నిర్మాణాలను ఈ నెలాఖరులోపు పనులు పూర్తి చేయాలని ఏపీడీ చెన్నకేశవులు తెలియజేశారు. గురువారం మండలంలోని మదిగుబ్బ, సనప, వేపచెర్ల , తోపుదుర్తి గ్రామాల్లో జరుగుతున్న పనులను ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఏపీఓ సుజాతతో కలసి పరిశీలించారు. పనులు నాణ్యతగా ఉండాలని, పనులు సకాలంలో పూర్తి చేస్తే బిల్లులు కూడా త్వరగా అందుతాయన్నారు. అదే విధంగా ఉపాధి హామీ పనులకు సంబంధించి ప్రతి కుటుంబం మార్చి 30వ తేదీలోపు వంద రోజుల పని పూర్తి చేసుకోవాలన్నారు.

వివాహిత అదృశ్యం



ప్రవల్లిక

తాడిపత్రిటౌన్: పట్టణంలోని రాగితోటపాలెంకు చెందిన ప్రవల్లిక అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాదాపు 7 సంవత్సరాల క్రితం ఆళ్లగడ్డకు చెందిన గౌతమ్‌తో ప్రవల్లికకు వివాహం అయింది. ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్యభర్తల మనస్పర్థల కారణంగా రెండు నెలల క్రితం ప్రవల్లిక తాడిపత్రికి వచ్చింది. ఈ నేపథ్యంలో ఈనెల 17 అదృశ్యం అయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బ్లాక్ స్పాట్ల గుర్తింపు

గార్లదిన్నె: 44వ జాతీయ రహదారిపై పోలీసులు,ఆర్టీఏ అధికారులు గురువారం సంయుక్తంగా బ్లాక్ స్పాట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు అరికట్టడానికి జాతీయ రహదారిపై చేపట్టాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలిపారు. అలాగే సైన్ బోర్డులు, కాషన్ బోర్డులు, రోడ్ బేరియర్స్, స్పీడ్ బ్రేకర్లు, వంటివి ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ సునీత తదితరులు పాల్గొన్నారు.

నీరు–చెట్టు బిల్లుల్లో రాజకీయం తగదు



అధికారులను నిలదీస్తున్న సాకేహరి

అనంతపురం సెంట్రల్: నీరు–చెట్టు పనులు చేసి అప్పుల్లో కూరుకుపోయారని, బిల్లుల చెల్లింపులో రాజకీయం చేయడం తగదని ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మండిపడ్డారు. గురువారం నీటిపారుదల శాఖ కార్యాలయంలో బాధితులతో కలిసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. 2019లో పనులు చేసినా ఇప్పటికీ బిల్లులు రాకపోవడంతో వడ్డీలు కట్టుకోలేక చాలా మంది ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బిల్లులు చెల్లిస్తున్నారని, అయితే ఒకే సామాజిక వర్గానికి చెందిన వారికి ఇస్తుండటం, దళితులు, సామాన్యులను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. రాజకీయ బలగం లేని వాళ్ల నుంచి ముడుపులు దండుకోవడానికే అధికారులు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. న్యాయపరంగా బిల్లులను చెల్లించాలని, లేదంటే బాధితులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళితసంఘం నాయకులు సోమశేఖర్, రామకృష్ణ, కేశవ, వెంకటేష్, నాగరాజు, ఆత్మకూరు, గుత్తి మండలాలకు చెందిన బాధిత కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఉచిత గర్భకోశ చికిత్సా శిబిరం



పాడి పశువును పరీక్షిస్తున్న పశుసంవర్థకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రకాష్

రాప్తాడు: లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భాదారణ ప్రక్రియతో పాడి రైతులకు ప్రయోజనాలున్నాయని పశుసంవర్థకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రకాష్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని గొల్లపల్లిలో ఉచిత గర్భకోశ చికిత్సా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం సూదులను ప్రభుత్వమే సరఫరా చేస్తుందని, ఈ వీర్యం వలన 90 శాతం పెయ్యి దూడలే జన్మిస్తాయన్నారు. భవిష్యత్‌లో లింగ నిర్ధారిత వీర్యం అత్యధిక ప్రాచుర్యం పొందుతుందన్నారు. అనంతరం పాడి పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి, పాడి పశువులతో పాటు గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపారు. సాధారణ పశువులకు కూడా చికిత్స అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు పద్మావతమ్మ, వీఎల్‌ఓ, ఏహెచ్ఏలు నరేష్, ఉమాశంకర్, దివ్యశ్రీ, ఓఎస్ వరప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో పెద్దమ్మ



అలంకరణలో మారెమ్మ

రాప్తాడు: మండల కేంద్రమైన రాప్తాడులో వెలసిన స్థానిక పెద్దమ్మ, మారెమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా వేకువ జామునే అమ్మవార్లకు వేదపండితుల ఆధ్వర్యంలో పెద్దమ్మ, మారెమ్మ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. పూజారి ఓలయ్య ప్రత్యేక పూజలు చేశారు. రాప్తాడు, అనంతపురం రూరల్ మండలంలోని పలు గ్రామాల్లోని భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం ఆలయం దగ్గర భక్తాదులతో పాటు స్థానిక జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అన్నదానం చేశారు.



విద్యార్థులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

తపాలా ఉద్యోగులకు పోటీలు



క్యారమ్స్ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

అనంతపురం సిటీ: అనంతపురంలోని తపాలా శాఖ ప్రధాన కార్యాలయంలో ఆ శాఖ ఉద్యోగులకు గురువారం వివిధ రకాల పోటీలు నిర్వహించారు. తపాలా శాఖ ఏఎస్పీ కృష్ణ చైతన్య, హెడ్ పోస్ట్‌మాస్టర్ భానుకుమార్, జీడీఏ తపాలా ఉద్యోగుల సంఘం డివిజన్ కార్యదర్శి కృష్ణయ్య యాదవ్ ఆధ్వర్యంలో క్యారమ్స్, చెస్ పోటీలు నిర్వహించారు. డివిజన్ పరిధిలోని అన్ని సబ్, బ్రాంచ్ పోస్టాఫీసులకు చెందిన తపాలా ఉద్యోగులు తరలివచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళా ఉద్యోగులు, పురుష ఉద్యోగులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన ఉద్యోగులకు ఈనెల 26న గణతంత్ర దినోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నట్లు తపాలా శాఖ ఏఎస్పీ కృష్ణ చైతన్య తెలిపారు.

అనంతలో మరో సాంస్కృతిక వేడుక

- రేపటి నుంచి రెండు రోజుల పాటు ఫోక్ సంబరాలు



సాధన చేస్తున్న నిర్వాహక బృందంతో మాస్టర్ హరిప్రసాద్

అనంతపురం కల్చరల్: మరో సాంస్కృతిక వేడుకకు అనంత సిద్ధమైంది. ఈ నెల 25, 26 తేదీల్లో అనంతపురంలోని టీటీడీ కల్యాణ మంటపం వేదికగా జానపద నృత్య సంబరాలు నిర్వహించనున్నారు. నృత్యాన్ని ఆరోగ్యకర జీవన విధానంగా మార్చి గత పాతికేళ్లలో నాలుగు వరల్డ్ రికార్డులు సొంతం చేసుకున్న లహరి డ్యాన్స్ ఫిట్‌నెస్ అకాడమీ నిర్వాహకుడు హరిప్రసాద్ నేతృత్వంలో ఈ సంబరాలు అట్టహాసంగా జరగనున్నాయి. అకాడమీ రజతోత్సవ వేడుకల్లో భాగంగా జరిగే ఈ జానపద సంబరంలో తొలి రోజు కార్యక్రమానికి ప్రముఖ కొరియోగ్రాఫర్ స్వర్ణ మాస్టర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. రెండోరోజు ప్రముఖ నటుడు సంపూర్ణేష్‌బాబు ఆత్మీయ అతిథిగా విచ్చేసి ఇతర జిల్లాల నుంచి ప్రాతినిథ్యం వహించిన డ్యాన్స్ మాస్టర్లను సత్కరించనున్నారు. వీరితో పాటూ స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులూ విశిష్ట అతిథులుగా హాజరు కానున్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



అనంతకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కసిరెడ్డి కేశవరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన ఉండాలని, ప్రజా సమస్యలపై పోరాడటంతో పాటు పార్టీ పటిష్టతకు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిని ఆయన నివాసంలో వివిధ విభాగాల అనుబంధ సంఘాల అధ్యక్షులు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ పదవిని కేటాయించడంపై వారు హర్షం వ్యక్తం చేస్తూ.. అనంతను సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎత్తి చూపాలన్నారు. గత వైఎస్సార్ సీపీ పాలన, ప్రస్తుత కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. జిల్లా అధ్యక్షుడిని కలిసిన వారిలో వైఎస్సార్ సీపీ అనంతపురం నియోజకవర్గం సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు కసిరెడ్డి కేశవరెడ్డి, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు లావణ్య, దివ్యాంగుల విభాగం అధ్యక్షులు ఎస్‌కే కాలేష్, లీగల్ సెల్ అధ్యక్షుడు వెంకటరాముడు, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు జూటూరు సుధాకర్ రెడ్డి ఉన్నారు. కాగా ఈ కార్యక్రమంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్ర, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గాజుల ఉమాపతి, తదితరులున్నారు.

రైతాంగానికి కృష్ణాజలాలే శరణ్యం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్

అనంతపురం టవర్‌క్లాక్: రాయలసీమలో రైతులు అభివృద్ధి చెందాలంటే హంద్రీనీవా నుంచి వచ్చే కృష్ణా జలాలే శరణ్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సీపీఐ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ హంద్రీనీవా నీటి పంపిణీ సక్రమంగా జరగకపోతే రాయలసీమకు అన్యాయం జరుగుతుందన్నారు. భవిష్యత్‌లో ఎడారిగా మారే అవకాశాలు కూడా ఉన్నాయన్నారు. రాయలసీమలో 6.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టుపై ప్రభుత్వాలు శీతకన్ను వేయడం అన్యాయమన్నారు. లైనింగ్ పనులు చేపడితే భూగర్భ జలాలు అడుగంటి రైతులకు నష్టం జరుగుతుందన్నారు. రాజకీయాలకతీతంగా పోరాటాలు చేపడితే తప్పకుండా న్యాయం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాదా గాంధీ, నాయకులు మల్లికార్జున, రాజారెడ్డి, కాటమయ్య, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు నీరిచ్చి రైతులను ఆదుకోండి



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: పీఏబీఆర్ కుడికాలువ కింద అన్ని చెరువులకు నీరిచ్చి రైతులను ఆదుకోవాలని జిల్లా పండ్ల తోటల రైతు సంఘం నాయకులు కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు విన్నవించారు. ఈ మేరకు గురువారం సంఘం జిల్లా అధ్యక్షుడు అనంతరాముడు, ఉపాధ్యక్షుడు నారపరెడ్డి, ఆనంద్, కార్యదర్శి మురళీమోహన్ చౌదరి తదితరులు కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. పీఏబీఆర్ కుడికాలువకు గత డిసెంబర్ 2వ తేదీన నీరు వదలగా, ఇప్పటికీ చివరి చెరువులకు నీరు చేరలేదన్నారు. కొన్ని చెరువులకు నీరే విడుదల చేయలేదని చెప్పారు. గత ఏడాది, ఈ ఏడాది కూడా పీఏబీఆర్ కుడికాలువ పరివాహక ప్రాంతంలో వర్షాలు సరిగా కురవక భూగర్భజలాలు అడుగంటాయన్నారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని చెరువులు నింపేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు పవన్‌కుమార్, నాయుడు, రంగాచారి, సూరి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధితోనే దేశ పురోగతి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ వీసీ అనిత

అనంతపురం: గ్రామీణాభివృద్ధితోనే దేశ పురోగతి సాధ్యమని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి. అనిత అన్నారు. ఎస్కేయూలోని సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ ఆధ్వర్యంలో 'గ్రామీణాభివృద్ధికి వ్యవసాయ రంగం, దాని అనుబంధ రంగాల వ్యూహాలు' అనే అంశంపై గురువారం జాతీయ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అత్యంత దుర్భిక్ష ప్రాంతమైన జిల్లాలో అన్నదాతకు దన్నుగా ఉండే పథకాలపై అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తక్కువ వర్షపాతంతో గణనీయ దిగుబడి వచ్చే పంటలు, మార్కెటింగ్ సదుపాయం తదితర అంశాలపై పరిశోధన జరగాలన్నారు. రెక్టార్ ప్రొఫెసర్ జి. వెంకటనాయుడు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ. కృష్ణ కుమారి, పశుసంవర్థక శాఖ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ఏ. కృష్ణ మూర్తి, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌పీ ఎల్లప్ప, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం. మునినారాయణప్ప, అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ కే. వెంకట రెడ్డి, డాక్టర్ డి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న డీసీహెచ్ పాల్ రవికుమార్

రాయదుర్గం: రాయదుర్గం ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం చేసే సిబ్బందిపై చర్యలు తప్పవని డీసీహెచ్ పాల్ రవికుమార్ హెచ్చరించారు. గురువారం ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది, ఇతర రికార్డులను పరిశీలించారు. అనంతరం మెడికల్, నర్సింగ్ సూపరిండెంట్లు మెర్సీ జ్ఞానసుధ, పార్వతి ఆధ్వర్యంలో వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీహెచ్ మాట్లాడారు. ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బంది కొరత తీర్చేలా కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం చిన్నపిల్లలు, కంటి వైద్యులను నియమించామన్నారు. త్వరలో ఆర్థో డాక్టర్, ఈఎన్‌టీ డాక్టర్ నియామకానికి చర్యలు చేపట్టామన్నారు. పారిశుధ్య కార్మికుల వేతన బకాయిలు చెల్లించామన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల భర్తీకి వచ్చే వారం నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. అర్హత ఆధారంగా పోస్టుల నియామకానికి చర్యలు చేపడతామన్నారు. ఆస్పత్రిలో ఒకరిద్దరిలో సమన్వయం లోపించిందన్నారు. అలాంటి వారిపై విచారణ చేపట్టి కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. మెడికల్ సూపరింటెండెంట్ ఆదేశాలను దిక్కరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నూతన భవన నిర్మాణాలను త్వరలో పూర్తిచేసేలా కాంట్రాక్టర్ పై ఒత్తిడి తీసుకొచ్చామన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువర్స్



● ఇంగ్లీష్ ఇడియమ్స్

లెట్ ది డస్ట్ సెటిల్

ఒక సంక్షోభం తరువాత లేదా గందరగోళం తరువాత వచ్చే సమయం కోసం ఎదురుచూసే సందర్భంలో వాడే మాట...లెట్ ది డస్ట్ సెటిల్.

ఉదా: ది కంపెనీ ఈజ్ ఫేసింగ్ క్రిటిసిజమ్ నౌ, బట్ దే ఆర్ వెయిటింగ్ టు లెట్ ది డస్ట్ సెటిల్ బిఫోర్ మేకింగ్ ఏ స్టేట్‌మెంట్

● మ్యూజిక్ వరల్డ్

మదిని దోచేలా మైమరచి పోయేలా!



అమెరికన్ సింగర్–సాంగ్ రైటర్ గ్రేసీ అబ్రామ్స్ రాసిన పాట 'దట్ ఈజ్ సో ట్రూ' బిల్‌బోర్డ్ జాబితాలో అగ్ర స్థానంలో ఉంది. ఇది గ్రేసీ రెండవ ఆల్బమ్. అమెరికాకు వెలుపల ఆస్ట్రేలియా, బెల్జియం, న్యూజీలాండ్, నార్వే, యూనైటెడ్ కింగ్ డమ్, ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ, నెదర్లాండ్స్, స్వీడన్, స్విట్జర్లాండ్‌లో మ్యూజిక్ చార్ట్‌లలో అగ్ర స్థానంలో నిలిచింది. 'ఐ కుడ్ గో అండ్ రీడ్ యువర్ మైండ్' అని హుషారెత్తిస్తోంది. ఆ సందడిలో మీరు భాగం కావాలంటే....'దట్ ఈజ్ సో ట్రూ' ఒక్కసారి వినేయండి. 'షీ ఈజ్ సో కూల్' అంటూ గ్రేసీతో గొంతు కలపండి.

● గేమింగ్

స్పైడర్–మ్యాన్ మరోసారి...

గ్రేట్ సూపర్ హీరోలా సాహసాలు ఎప్పుడూ సూపర్‌గానే ఉంటాయి. దీనికి ఉదాహరణ... స్పైడర్–మ్యాన్!

ఒక్క ముక్కలో చెప్పాలంటే స్పైడర్–మ్యాన్ గేమ్స్ ఎన్నో సాహసాలకు కేరాఫ్ అడ్రస్. 'మార్వెల్స్ స్పైడర్–మ్యాన్ 2' యాక్షన్ అడ్వెంచర్ గేమ్. మార్వెల్ కామిక్స్ క్యారెక్టర్ 'స్పైడర్–మ్యాన్' ఆధారంగా రూపొందించిన గేమ్ ఇది. థర్డ్ పర్సన్ పర్‌స్పెక్టివ్ నుంచి ఆడే ఈ గేమ్‌లో పీటర్ పార్కర్, మైకేల్ మోరేల్స్ ప్రధాన పాత్రలు. న్యూయార్క్ కేంద్రంగా సాగే ఈ ఆటలో ప్లేయర్స్ రకరకాల స్పైడర్–మ్యాన్ సూట్‌లను సేకరించవచ్చు.

సమస్త సాహసాలతో గేమింగ్ కమ్యూనిటీని ఆకట్టుకునే 'మార్వెల్స్ స్పైడర్–మ్యాన్' ఈ నెల చివర రానుంది.



సిరీస్: మార్వెల్స్ స్పైడర్–మ్యాన్
ప్లాట్‌ఫామ్స్: విండోస్
జానర్: యాక్షన్–అడ్వెంచర్
మోడ్: సింగిల్–ప్లేయర్



● రికార్డ్

ప్రయాణ ప్రేమికుడు, ప్రఖ్యాత పర్వతారోహకుడు సర్ మార్టిన్ కాన్వే 'అధిరోహించిన ప్రతి శిఖరం ఏదో ఒకటి నేర్పుతుంది' అంటారు. అలా చిన్న వయసులోనే ఎన్నో శిఖరాల ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకుంది విశాఖపట్నానికి చెందిన కామ్య కార్తికేయన్. పదహారేళ్లకే ఎవరెస్ట్ అధిరోహించి రికార్డ్ సృష్టించింది. తాజాగా అంటార్కిటికాలోని మౌంట్ విన్సన్‌ని అధిరోహించి సెవెన్ సమ్మిట్స్ పూర్తి చేసిన యంగెస్ట్ ఫిమేల్‌గా రికార్డు సృష్టించింది....

కామ్య... అఖండ ఖ్యాతి

ఇలా మొదలైంది...

కార్తికేయన్, లావణ్య దంపతులకు సాహస యాత్రలు ఇష్టం. తమ చిన్నారి కామ్యను భుజాలపై మోసుకుంటూనే ట్రెక్కింగ్‌కు వెళుతుండేవారు. అలా పర్వత శిఖరాలతో చిన్నవయసులోనే కామ్యకు పరిచయం అయింది. మూడేళ్ల వయసులోనే ముంబైలోని లోనావాలాలో తండ్రితో పాటు ట్రెక్కింగ్‌లో పాల్గొని 'శభాష్' అనిపించుకుంది. మహారాష్ట్రలోని డ్యూక్స్ నోస్, రాజ్‌గడ్ పర్వతాల్ని నాలుగేళ్ల వయసులో తల్లిదండ్రులతో పాటు అధిరోహించింది.

తల్లికి తగిన తనయ...

హిమాలయాల ట్రెక్కింగ్‌కు తల్లితో పాటు వెళ్లింది కామ్య. అప్పుడు ఆమె వయసు ఏడేళ్లు. తల్లీ కూతుళ్లు మొదటి ప్రయత్నంలోనే 12 వేల అడుగుల ఎత్తైన చంద్రశీల పర్వతారోహణ చేశారు. ఆ తర్వాత హిమాలయ పర్వత శ్రేణుల్లో ఒకటైన 13,500 అడుగుల ఎత్తైన హర్‌కిదమ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేశారు. అది పూర్తి చేసిన కొద్ది రోజుల్లోనే 13,500 అడుగుల ఎత్తైన కేదార్‌కంఠ పర్వతారోహణ చేశారు. తొమ్మిదేళ్ల వయసులో హిమాలయాల్లో రూప్‌కుండ్ ట్రెక్కింగ్ చేసి రికార్డు సృష్టించింది కామ్య.

ప్రధాని మన్ కీ బాత్‌లో కామ్య...

'అవరోధాల్ని అధిగమించి మన ఖ్యాతిని ఖండాంతరాల్లో ఇనుమడింపజేయాలి అనుకునేవారికి విశాఖ నగరానికి చెందిన కామ్య కార్తికేయన్ అనే చిన్నారి స్ఫూర్తినిచ్చింది' అంటూ ప్రధాని నరేంద్ర మోదీ కామ్యను ప్రశంసించారు. దక్షిణ అమెరికాలోని అత్యంత ఎత్తైన అకాన్కాగువా పర్వతాన్ని అధిరోహించిన సమయంలో మన్‌కీ బాత్‌లో కామ్య ప్రస్తావన తీసుకువచ్చారు మోదీ.

– కరుకోల గోపీకిశోర్‌రాజా, సాక్షి, విశాఖపట్నం

ఆల్ రౌండర్

ముంబై నేవీ స్కూల్‌లో ప్లస్‌టు చదువుతున్న కామ్య కార్తికేయన్ పర్వతారోహణలోనే కాదు చదువులోనూ ప్రతిభ కనబరుస్తోంది. ప్రతి పరీక్షలోనూ ఫస్ట్ గ్రేడ్ సాధిస్తోంది. సంగీతంలోనూ ప్రావీణ్యం పొందిన కామ్య పియానో వాయిద్యానికి సంబంధించి 3 గ్రేడులు పాసైంది. కర్ణాటక సంగీతం, భరతనాట్యంలోనూ 'ఆహా' అనిపించేలా ప్రతిభ చూపుతోంది.

ఏడు ఖండాల్లో ఎన్ని రికార్డ్‌లో!

● దక్షిణ అమెరికాలో 22,837 అడుగుల ఎత్తైన మౌంట్ అకాన్‌కాగువాని అధిరోహించి ఈ శిఖరాన్ని అధిరోహించిన తొలి బాలికగా ప్రపంచ రికార్డు సృష్టించింది ● ఆఫ్రికా ఖండంలో అత్యంత ఎత్తైన 18,652 అడుగుల మౌంట్ కిలిమంజారోపై త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించి ఈ శిఖర యాత్ర పూర్తి చేయించడం ద్వారా ఆసియాలోనే అతి పిన్న వయస్కురాలిగా రికార్డు ● యూరప్ ఖండంలోని అత్యంత ఎత్తైన 18,510 అడుగుల మౌంట్ ఎల్‌బ్రస్‌ని అధిరోహించి యంగెస్ట్ గర్ల్ ఇన్‌ది వరల్డ్‌గా రికార్డు ● ఆస్ట్రేలియా ఖండంలోని అతి ఎత్తైన మౌంట్ కాజియాస్కోని అధిరోహించిన రెండో బాలికగా రికార్డు ● ఉత్తర అమెరికాలోని 20,308 అడుగుల మౌంట్ డెనలీని అధిరోహించిన యంగెస్ట్ నాన్ అమెరికన్‌గా రికార్డు ● ఆసియా ఖండంలో అత్యంత ఎత్తైన 29,031 అడుగుల మౌంట్ ఎవరెస్ట్‌ని అధిరోహించి నేపాల్ వైపు నుంచి ఎవరెస్ట్‌ని అధిరోహించి ప్రపంచంలోనే అతి పిన్న వయస్కురాలిగా, తాజాగా అంటార్కిటికాలోని మౌంట్ విన్సన్‌ని అధిరోహించి, ప్రపంచంలోనే అతి పిన్నవయస్కురాలిగా రికార్డ్ సృష్టించింది.

ప్రతి అడుగూ సవాల్‌గా స్వీకరించాను

సెవెన్ సమ్మిట్స్ పూర్తి చేసి భారత త్రివర్ణపతాకాన్ని ఏడు ఖండాల్లోనూ రెపరెపలాడించాలన్నదే అమ్మా, నాన్నల కల. వారి ఆకాంక్ష నెరవేర్చినందుకు గర్వంగా ఉంది. ఒకానొక సమయంలో మా పేరెంట్స్ తమ సంపాదనంతా నా మీదే ఖర్చు చేశారు. కొందరు దాతలు సహకారం అందించి నన్ను ముందుకు నడిపించారు. ఎంతటి కష్టాన్నైనా అవలీలగా ఎదుర్కోవాలన్నది నాన్న దగ్గర నేర్చుకున్నాను. – కామ్య కార్తికేయన్

● టెక్.. టాక్

ఇన్‌స్టాలో ఎడిట్ యాప్



స్మార్ట్‌ఫోన్‌లలో షార్ట్ వీడియో క్రియేషన్ సరికొత్త స్థాయికి చేరుకుంది. క్రియేటర్స్‌కు దగ్గరైన ప్లాట్‌ఫామ్‌లలో ఇన్‌స్టాగ్రామ్ ఒకటి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఐఫోన్‌ల కోసం 'ఎడిట్' యాప్‌ను ప్రకటించింది ఇన్‌స్టా.

'అధిక నాణ్యతతో వీడియోను రికార్డ్ చేయడానికి, మీరు కోరుకునే అన్ని ఎడిటింగ్ సాధనాలు, ఫ్రెండ్స్‌తో పాటు ఇతర క్రియేటర్‌లతో డ్రాఫ్ట్‌ను షేర్ చేసే సామర్థ్యం ఎడిట్‌లో ఉంటాయి. ఎడిట్ అనేది క్రియేటివ్ టూల్స్ సమాహారం' అని ప్రకటించాడు ఇన్‌స్టాగ్రామ్ హెడ్ ఆడమ్ మొస్సేరి.

'ఎడిట్స్' యాప్‌ను ఉపయోగించడం వల్ల యూజర్‌లు వాటర్ మార్క్ లేకుండా వీడియోలను ఎక్స్‌పోర్ట్ చేయడానికి, వీడియోల పనితీరును విశ్లేషించడానికి...మొదలైన వాటికి ఉపయోగపడుతుంది. ఈ యాప్ 2కె రిజల్యూషన్ నుంచి 60 ఎఫ్‌పిఎస్ వరకు హెచ్‌డీఆర్, ఎస్‌డీఆర్ ఫార్మట్‌లో ఎడిటింగ్ వీడియోలను సపోర్ట్ చేస్తుంది.

ఇక మూడు నిమిషాలు!



యూట్యూబ్ షార్ట్స్ మాదిరిగానే మూడు నిమిషాల నిడివి గల వీడియోలను ప్లాట్‌ఫామ్‌లో అప్లోడ్ చేయవచ్చని తెలియజేసింది ఇన్‌స్టాగ్రామ్. గతంలో 90 సెకన్‌ల వరకు వీడియోలను అప్లోడ్ చేసే అవకాశం కల్పించింది ఇన్‌స్టాగ్రామ్.

'ఇక నుంచి మీరు మూడు నిమిషాల నిడివి గల రీల్స్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేయవచ్చు. ఇన్‌స్టాగ్రామ్‌లో లాంగ్–ఫామ్ వీడియోలపై కాకుండా షార్ట్–ఫామ్ వీడియోలపై దృష్టి పెట్టాలనుకున్నాం. కానీ 90 సెకనులు చాలా తక్కువ సమయం అని క్రియేటర్‌ల నుంచి ఫీడ్‌బ్యాక్ వచ్చింది. పెంచిన సమయం వల్ల మీరు మరిన్ని స్టోరీలను షేర్ చేయవచ్చు' అని ఇన్‌స్టాగ్రామ్ ప్రకటించింది.



ఏసర్ స్విఫ్ట్ జో 14

స్క్రీన్ సైజ్: 14 అంగుళాలు
స్క్రీన్ రిజల్యూషన్: 2880×1800 పిక్సెల్స్
డైమెన్షన్స్: 312.9×217.9×14.9 ఎంఎం
బరువు: 1.25 కేజీ

ఓపెన్ ఏఐ టాస్క్స్



'టాస్క్స్' అనే న్యూ చాట్‌జీపీటి కేపబిలిటీతో ముందుకురానుంది ఓపెన్ ఏఐ. ప్రస్తుతం ఇది బీటా దశలో ఉంది. అలారం సెట్ చేయడం, ప్రజెంటేషన్ ఇవ్వడానికి అవసరమైన రాబోయే సమావేశాన్ని గుర్తు చేయడంలాంటి పనులను చేయగలదు. నీరు తాగడం నుంచి గ్రాసరీ షాపింగ్ వరకు ఎన్నో విషయాలలో 'టాస్క్స్' ద్వారా రిమైండర్స్ సెట్ చేసుకోవచ్చు.

సాక్షి సినిమా

హిట్ కాదు... ట్రిపుల్ బ్లాక్ బస్టర్

– వెంకటేశ్


● భీమ్స్, వెంకటేశ్, అనిల్ రావిపూడి

''సంక్రాంతి పండగకి నిజాయతీగా ఓ ఫ్యామిలీ సినిమా ఇవ్వాలనుకున్నాం. ప్రేక్షకులు మా ప్రయత్నాన్ని ఆదరించారు. హిట్ కాదు... ట్రిపుల్ బ్లాక్ బస్టర్ అంటున్నారు. మా సినిమాకి ఇంత పెద్ద సక్సెస్ ఇచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అని హీరో వెంకటేశ్ అన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా నటించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 14న విడుదలైంది. గురువారం చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వెంకటేశ్ మాట్లాడుతూ– ''అనిల్‌తో నేనో ఫ్రెండ్‌లానే ఉంటాను. మేము చాలా ఎంజాయ్ చేస్తూ వర్క్ చేస్తాం.. అందుకే రిజల్ట్ ఇంత పాజిటివ్‌గా ఉంటుంది. ఇక నా సినిమా ఇన్ని కోట్లు వసూలు చేయాలని నేనెప్పుడూ అడగను... వచ్చింది తీసుకోవాలి. ఇప్పటికే మా సినిమా రూ. 230 కోట్లు వసూలు చేయడం అనేది బోనస్.. ఇంతకంటే ఏం కావాలి'' అన్నారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ–''సినిమాకి కాస్త దూరమైన ప్రేక్షకులు కూడా మా 'సంక్రాంతికి వస్తున్నాం' కోసం థియేటర్‌కి రావడం ఆనందంగా ఉంది. రెవెన్యూ సైడ్ కూడా మేం ఊహించినదానికంటే అద్భుతంగా రావడం హ్యాపీ'' అని చెప్పారు. ''వెంకటేశ్‌గారి 'కలిసుందాం రా' సినిమా పాటలని ప్రేక్షకులు ఎంత గుండెల్లో పెట్టుకున్నారో... 'సంక్రాంతికి వస్తున్నాం' సాంగ్స్‌ని కూడా అదే స్థాయిలో ఆస్వాదించడం సంతోషంగా ఉంది'' అని సంగీత దర్శకుడు భీమ్స్ అన్నారు.

లైలాగా రెడీ కావడానికి రెండు గంటలు పట్టేది

– విశ్వక్ సేన్


● సాహు గారపాటి, విశ్వక్ సేన్, రామ్ నారాయణ్

''నా కెరీర్‌లో యాక్షన్ టచ్‌తో రూపొందిన ఔట్ అండ్ ఔట్ కామెడీ ఫ్యామిలీ ఫిల్మ్ 'లైలా'. చాలా క్లీన్‌గా ఉంటుంది. ప్రేక్షకులంతా ఎంజాయ్ చేస్తారు. ఈ సినిమా కోసం లైలాగా రెడీ కావడానికి రెండు గంటలు పట్టేది. నిజంగా అమ్మాయిలకు హ్యాట్సాఫ్ చెప్పాలి'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. రామ్ నారాయణ్ దర్శకత్వంలో విశ్వక్ సేన్, ఆకాంక్షా శర్మ జంటగా నటించిన చిత్రం 'లైలా'. సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 14న విడుదల కానుంది. లియోన్ జేమ్స్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'ఇచ్చుకుందాం బేబీ...' అంటూ సాగే రెండో పాటని విడుదల చేశారు. పూర్ణాచారి సాహిత్యం అందించిన ఈ పాటని ఆదిత్య ఆర్కే, ఎంఎం మానసి ఆలపించారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''లైలా'లో మోడల్ సోనూ, లైలా అనే రెండు పాత్రల్లో నటించా'' అన్నారు. ''లైలా' కథ ఇద్దరు ముగ్గురు హీరోలకు చెప్పాను. లేడీ గెటప్ వేయడం అంత ఈజీ కాదు. సినిమా అంటే పిచ్చి ఉంటేనే చేయగలరు. అలాంటి పిచ్చి ఉన్న విశ్వక్ దొరికారు'' అని రామ్ నారాయణ్ చెప్పారు. ''ఈ పాత్ర విశ్వక్ కెరీర్‌లో నిలిచిపోతుంది'' అన్నారు సాహు గారపాటి. పాటల రచయిత పూర్ణాచారి మాట్లాడారు.


● సాయిపల్లవి, నాగచైతన్య

హైలెస్సో హైలెస్సా

'హైలెస్సో హైలెస్సా...' అంటూ ఆడి పాడేస్తున్నారు నాగచైతన్య, సాయిపల్లవి. చందు మొండేటి దర్శకత్వంలో నాగచైతన్య, సాయి పల్లవి జోడీగా నటించిన చిత్రం 'తండేల్'. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్‌పై బన్నీ వాసు నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 7న విడుదల కానుంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'హైలెస్సో హైలెస్సా... నీవైపే తెరచాపని తిప్పేసా...' అంటూ సాగే మూడో పాటని గురువారం రిలీజ్ చేశారు. శ్రీమణి సాహిత్యం అందించిన ఈ పాటని శ్రేయా ఘోషల్, నకాష్ అజీజ్ పాడారు. ''మోస్ట్ ఎవైటెడ్ లవ్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'తండేల్'. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన 'బుజ్జి తల్లి..', 'నమో నమః శివాయ...' పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. వండర్‌ఫుల్ మెలోడీస్‌ని కంపోజ్ చేయడంలో మాస్టర్ అయిన దేవిశ్రీ ప్రసాద్ తాజాగా 'హైలెస్సో హైలెస్సా..' అంటూ సాగే మరొక లవ్ మెలోడీని కంపోజ్ చేశారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

ఉత్తమ చిత్రం: అనోరా, ది బ్రూటలిస్ట్, ఎ కంప్లీట్ అన్‌నోన్, కాన్‌క్లేవ్, డ్యూన్: పార్ట్ 2, ఎమిలియా పెరెజ్, ఐయామ్ స్టిల్ హియర్, నికెల్ బాయ్స్, ది సబ్‌స్టాన్స్, విక్డ్ ● **ఉత్తమ దర్శకుడు:** సీన్ బేకర్ (అనోరా), బ్రాడీ కార్బెట్ (ది బ్రూటలిస్ట్), జేమ్స్ మ్యాన్‌గోల్డ్ (ది కంప్లీట్ అన్‌నోన్), జాక్వెస్ ఆడియార్డ్ (ఎమిలియా పెరెజ్), కోరలీ ఫార్గేట్ (ది సబ్‌స్టాన్స్) ● **ఉత్తమ నటుడు:** అడ్రియాన్ బ్రాడీ (ది బ్రూటలిస్ట్), తిమోతీ చాలమెట్ (ది కంప్లీట్ అన్‌నోన్), కోల్‌మెన్ డొమినింగో (సింగ్‌సింగ్), రే ఫియన్నెస్ (కాన్‌క్లేవ్), సెబస్టియన్ స్టాన్ (ది అప్రెంటిస్) ● **ఉత్తమ నటి:** సింథియా ఎరివో (విక్డ్), కార్లా సోఫియా గాస్కన్ (ఎమిలియా పెరెజ్), మికే మాడిసన్ (అనోరా), డెమి మూర్ (ది సబ్‌స్టాన్స్), ఫెర్నాండా టోర్రెస్ (ఐ యామ్ స్టిల్ హియర్) ● **ఉత్తమ సహాయ నటుడు:** యురా బోరిసోవ్ (అనోరా), కిరెన్ కల్కిన్ (ది రియల్ పెయిన్), ఎడ్వర్డ్ నార్టన్ (ది కంప్లీట్ అన్‌నోన్), గాయ్ పియర్స్ (ది బ్రూటలిస్ట్), జెరీమీ స్ట్రాంగ్ (ది అప్రెంటిస్) ● **ఉత్తమ సహాయ నటి:** మోనికా బార్బరో (ది కంప్లీట్ అన్‌నోన్), అరియానా గ్రాండే (విక్డ్), ఫెలిసిటీ జోన్స్ (ది బ్రూటలిస్ట్), ఇసబెల్లా రోస్సెల్లిని (కాన్‌క్లేవ్), జోయా సాల్డానా (ఎమిలియా పెరెజ్).


● కార్లా సోఫియా గ్లాస్కాన్

97వ ఆస్కార్ అవార్డ్ నామినేషన్స్ ప్రకటన

ఆస్కార్ సంబరం ఆరంభం






● 13 నామినేషన్లతో నాన్ ఇంగ్లిష్ మూవీ 'ఎమిలియా పెరెజ్' రికార్డ్
● 'ది బ్రూటలిస్ట్, విక్డ్' చిత్రాలకు 10 నామినేషన్స్
● ట్రాన్స్‌జెండర్‌కి దక్కిన తొలి నామినేషన్ ● ఇండియన్ షార్ట్ ఫిల్మ్‌కి నామినేషన్

97వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం ఈ ఏడాది మార్చి 2న లాస్ ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో ఘనంగా జరగనుంది. కాగా ఈ అవార్డులకు సంబంధించిన నామినేషన్లను గురువారం రాత్రి (భారతీయ కాలమానం ప్రకారం) ప్రకటించారు. అమెరికన్ నటుడు బోవెన్ యాంగ్, నటి రాచెల్ సెన్నాట్‌లు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. అయితే ఈ నామినేషన్ల ప్రకటన ఈ నెల 17న జరగాల్సింది. కానీ అమెరికాలో చెలరేగిన కార్చిచ్చు కారణంగా 19కి వాయిదా వేశారు. ఫైనల్‌గా 23న ప్రకటించారు.

రికార్డ్ సాధించిన స్పానిష్ మ్యూజికల్ థ్రిల్లర్

ఈసారి స్పానిష్ మ్యూజికల్ థ్రిల్లర్ మూవీ 'ఎమిలియా పెరెజ్' నాన్–ఇంగ్లిష్ విభాగంలో 13 నామినేషన్లు దక్కించుకుని రికార్డ్ సాధించింది. గతంలో చైనా మూవీ 'క్రౌచింగ్ టైగర్ హిడెన్ డ్రాగన్', మెక్సికన్–అమెరికన్ డ్రామా 'రోమా'... ఈ రెండు చిత్రాలు నాన్–ఇంగ్లిష్ విభాగంలో పది నామినేషన్లు దక్కించుకున్నాయి. ఇప్పుడు 13 నామినేషన్లతో 'ఎమిలియా పెరెజ్' వాటిని అధిగమించింది. అలాగే ఈ చిత్రంలో ఓ లీడ్ రోల్‌లో నటించిన స్పానిష్ నటి కార్లా సోఫియా గాస్కాన్ (బెస్ట్ యాక్ట్రెస్ లీడ్ రోల్ నామినేషన్) చరిత్ర సృష్టించారు. ఆస్కార్ అవార్డుకు నామినేట్ అయిన తొలి ట్రాన్స్‌జెండర్ నటిగా నిలిచారామె. ఇంకా 'ది బ్రూటలిస్ట్, విక్డ్' చిత్రాలకు పది నామినేషన్ల చొప్పున దక్కాయి. అంతగా అంచనాలు లేని 'కాన్‌క్లేవ్' మూవీకి 8 నామినేషన్లు దక్కడం ఓ విశేషం.

ఒక్క నామినేషన్ తేడాతో... నాన్ ఇంగ్లిష్ ఫిల్మ్ విభాగంలో 13 నామినేషన్లు దక్కించుకుని, రికార్డు సాధించిన 'ఎమిలియా పెరెజా'కి ఇంకో నామినేషన్ దక్కి ఉంటే... ఇంగ్లిష్ ఫిల్మ్‌ల రికార్డుని కూడా అధిగమించి ఉండేది. 'టైటానిక్, ఆల్ అబౌట్ ఈవ్, లా లా ల్యాండ్' వంటి ఇంగ్లిష్ చిత్రాలు 14 నామినేషన్లు దక్కించుకున్నాయి.



తల్లి హిస్టరీ రిపీట్: 'ఐయామ్ స్టిల్ హియర్' చిత్రానికి గాను ఫెర్నాండా టోర్రెస్ ఉత్తమ నటి విభాగంలో నామినేషన్ దక్కించుకున్నారు. ఇందులో విశేషం ఏంటంటే... ఆమె తల్లి ఫెర్నాండా మోంటెనెగ్రో 1991లో 'సెంట్రల్ స్టేషన్' చిత్రానికి గాను ఉత్తమ నటి విభాగంలో నామినేషన్ దక్కించుకున్న తొలి బ్రెజిలియన్ నటిగా రికార్డుని సాధించారు. ఇప్పుడు ఇన్నేళ్లకు మలి బ్రెజిలియన్ నటిగా టోర్రెస్ నామినేషన్ దక్కించుకుని తల్లి హిస్టరీని రిపీట్ చేశారు.

బరిలో ఇండియన్ షార్ట్ ఫిల్మ్: ఆడమ్ జే గ్రేవ్స్ దర్శకత్వం వహించిన 'అనూజ' బెస్ట్ షార్ట్ ఫిల్మ్ (లైవ్ యాక్షన్) విభాగంలో నామినేషన్ దక్కించుకుంది. ఆల్రెడీ రెండు ఆస్కార్ అవార్డులు సాధించిన భారతీయ నిర్మాత గునీత్ మోంగా ఈ చిత్రానికి ఓ నిర్మాత కావడం విశేషం. అలాగే నటి ప్రియాంకా చోప్రా ఓ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరించారు. ఢిల్లీలోని ఓ గార్మెంట్ ఫ్యాక్టరీలో పని చేసే తొమ్మిదేళ్ల అనూజ స్కూల్‌కు వెళ్లాలనుకుంటుంది. ఆ నిర్ణయం ఆమె జీవితాన్ని, అనూజ సోదరి పాలక్ భవిష్యత్‌ను ఏ విధంగా ప్రభావితం చేసింది? అనే కోణంలో ఈ చిత్రం సాగుతుంది. అనూజగా సజ్దా పఠాన్, పాలక్‌గా అనన్య షాన్‌భాగ్ నటించారు. ఇదిలా ఉంటే... గునీత్ మోంగా ఓ నిర్మాతగా వ్యవహరించిన 'ది ఎలిఫెంట్ విస్పరర్స్'కి గాను బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ విభాగంలో 2023లో ఆస్కార్ దక్కింది. అంతకుముందు 2021లో గునీత్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన 'పీరియడ్: ఎండ్ ఆఫ్ సెంటెన్స్'కిగాను బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ విభాగంలో అవార్డు దక్కింది. ఇప్పుడు ఆమె ఓ నిర్మాతగా వ్యవహరించిన 'అనూజ'కు కూడా ఆస్కార్ దక్కుతుందా? అనేది చూడాలి.

భారతీయ సినిమాకి నిరాశ

ఆస్కార్ అవార్డ్స్ రిమైండర్ లిస్ట్‌లో నిలిచిన భారతీయ చిత్రాలు 'కంగువ, ఆడు జీవితం ('ది గోట్ లైఫ్), సంతోష్, స్వతంత్రవీర్ సవార్కర్, ఆల్ ఉయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్, గర్ల్స్ విల్ బీ గర్ల్స్, పుతల్' ఆస్కార్ నామినేషన్‌ను దక్కించుకోలేకపోయాయి. అలాగే ఉత్తమ విదేశీ చిత్రం విభాగంలో నామినేషన్ కోసం ఈ ఏడాది ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పంపిన హిందీ చిత్రం 'లాపతా లేడీస్' ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లోనూ చోటు దక్కించుకోలేకపోయిన విషయం తెలిసిందే. ఇలా ఈసారి భారతీయ సినిమాకి నిరాశ ఎదురైంది.